


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 04-06-2022 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 220 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- ఏపీలో 4 రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవంగా వైఎస్ఆర్సీపీ కైవసం
- 30 మంది ఎంపీలం సమిష్టిగా రాష్ట్రం కోసం పోరాడతాం
- జగన్ నమ్మకాన్ని వమ్ము చేయం - ఈ అవకాశం ఇచ్చిన జగన్ కి కృతజ్ఞతలు
- బీసీలంటే.. బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ అని చాటిన ఏకైక సీఎం జగన్



అమరావతి (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లో నాలుగు రాజ్యసభ స్థానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నామినేషన్ల గడువు ముగియడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు అభ్యర్థులు వి. విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, నిరంజన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు డిక్లరేషన్ అందించారు. ఈ సందర్భంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు వి. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆశయాలు, పార్టీ విధి, విధానాల మేరకు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగించేలా ప్రతి కార్యక్రమం ఉంటుంది. మా మీద నమ్మకం ఉంచి, రాజ్య సభ సభ్యులుగా ఎంపిక చేసినందుకు జగన్

తరువాయి 2లో..

## అమిత్‌షాతో సీఎం జగన్ భేటీ..



న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షాతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. సౌత్ జోనల్ కమిటీ సమావేశంలో భాగంగా ప్రస్తావించిన విభజన సమస్యలు-వాటి పరిష్కార ప్రక్రియపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన అధికారుల సమావేశాల అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ ఆస్తుల పంపకం సహా విభజన సమస్యలన్నీ కూడా పెండింగులో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని సీఎం మరోమారు హెూంమంత్రికి విజ్ఞప్తిచేశారు. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన పలు అంశాలపైనకూడా సీఎం, హెూంమంత్రితో చర్చించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని సీఎం జగన్ తిరిగి తాడేపల్లి చేరుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి ఎజెండాగా కొనసాగిన ముఖ్యమంత్రి పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మల సీతారామన్ , గజేంద్ర సింగ్ షెకావత్ తో సీఎం జగన్ భేటీ అయిన సంగతి తెలిసిందే.

## ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జనసేన సిద్ధం

జనసేన పార్టీ పీ.ఏ.సీ. సభ్యులు కొణిదెల నాగబాబు




వార్త 8లో

## గ్యాస్ లీకేజీ ఘటనపై సీఎం జగన్ ఆరా

- అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం



అమరావతి (విజయభాను న్యూస్) : విశాఖపట్నం సమీపంలోని అచ్యుతాపురంలో అమ్మోనియా గ్యాస్ లీక్ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఘటనపై అధికారుల నుంచి వివరాలు కోరారు. ఘటనకు దారితీసిన కారణాలను సీఎంఓ అధికారులు వివరించారు. సంబంధిత జిల్లా కలెక్టర్ వెంటనే వెళ్లి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారని అధికారులు వెల్లడించారు. గ్యాస్ లీక్‌ను కూడా నియంత్రించారని అధికారులు తెలిపారు. బ్రాండిక్స్‌లో ఒక యూనిట్‌లో పనిచేస్తున్న మహిళలను అందరిని ఖాళీ చేయించామని, అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలించారని అధికారులు తెలిపారు. అంతా కోలుకుంటున్నారని, క్షేమంగా ఉన్నారని వివరించారు. అమ్మోనియా ఎక్కడ నుంచి లీకైందన్న అంశంపై అధికారులు దర్యాప్తు చేపట్టారన్నారు. అస్వస్థతకు గురైన వారికి మంచి వైద్యాన్ని అందించాలని సీఎం ఆదేశించారు. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేసి, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సీఎం ఆదేశాలు జారీచేశారు. ఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా స్థానిక మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సీఎం ఆదేశించారు. వెంటనే ఆయన విజయవాడ నుంచి అనకాపల్లి బయల్దేరి వెళ్లారు.

## జగన్ ఢిల్లీ పర్యటన మోసపూరిత పర్యటన



వార్త 6లో

## జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ త్వరతగతిన పూర్తిచేయాలి

- ప్రతి లబ్ధిదారునికి స్పష్టమైన హక్కు పత్రం అందజేయాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వైఎస్సార్ జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్లు త్వరతగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఈ విషయమై జిల్లా కలెక్టర్ జీవీఎంసీ కమిషనర్, జాయింట్ కలెక్టర్ తో కలసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, జోనల్ కమిషనర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాలలో ఇంకా పూర్తికాని లేఅవుట్లు కొరకు స్తల సేకరణ గావించి వేగంగా పనులు పూర్తిచేయాలని పేర్కొన్నారు.


సంతకాలు జరిగి సిద్దంగా ఉన్న పట్టాలను వచ్చే వారంలో పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో సేకరించిన భూమి సరిగా లేదని అధికారులు కలెక్టర్ దృష్టకి తీసుకురాగా, ఇప్పటిదాకా

తరువాయి 2లో..



# వాతావరణ మార్పులతో తీర ప్రాంతాలకు ముప్పు

## గీతం వెబ్‌నార్‌లో ఎన్‌జిఆర్‌ఐ శాస్త్రవేత్త డా॥బలరామ్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కాలుష్యం కారణంగా ప్రపంచ వాతావరణంలో వస్తున్న మార్పులకు 2050 సంవత్సరం నాటికి తీర ప్రాంతాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అలాగే అంటు వ్యాధులు ప్రభలడం, ఆహర పంటల దిగుబడులు తగ్గడం వంటివి మరికొన్ని దుష్పరిణామాలని నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్(ఎన్‌జిఆర్‌ఐ) విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ వి.బలరామ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం శుక్రవారంప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త స్వర్గీయ ప్రొఫెసర్ టి.శివాజీరావు స్మారకంగా నిర్వహించిన ధార్మికోపన్యాస కార్యక్రమంలో డాక్టర్ వి.బలరామ్ ప్రసంగించారు. కర్బన ఉద్గారాలకు తోడుగా ఇటీవలి కాలంలో ప్రమాదకర మీథేన్ వాయువు సహితం వాతావరణంలోకి ప్రవేశిస్తు ఉండడం ఆందోలన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఉష్ణోగ్రతలలో పెరుగుదల కారణంగా మంచుఖండాలు సహితం తమ ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయన్నారు. శతాబ్ధాల కాలంనాటి నుంచి వాతావరణంలో ముఖ్యంగా ఉష్ణోగ్రతలలో హెచ్చు తగ్గులు సహజ సిద్దంగా ఏర్పడుతున్నప్పటికి గత కొద్ది శతాబ్ధాలుగా ఉష్ణోగ్రతలలో పెరుగుదలలు మాత్రమే నమోదు అవుతున్నాయని ఆయన వెల్లడించారు. ప్రపంచ ఉష్ణోగ్రతలను, కాలుష్యాన్ని నియంత్రించడానికి సంప్రదాయేతర ఇందన వనరులపై దృష్ఠి సారించడంతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలు కర్బన ఉద్గారాల నుంచి ప్రయోజన కర ఉత్పత్తులను తయారు చేయడంపై పరిశోధనలు జరుపుతున్నాయని వెల్లడించారు. పెద్ద సంఖ్యలో అడవుల పెంపకం, విద్యుత్తు వాహనాల వినియోగం, మీథేన్ వాయువును నియంత్రించడం వంటివి పర్యావరణ పరిరక్షణకు దారి తీస్తాయని డాక్టర్ బలరామ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చంద్రబాబు, పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, ప్రొఫెసర్ ఎన్ శ్రీనివాస్, ఎమ్.కిరణ్మయి రెడ్డి, అద్యాపకులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛసంకల్పంతో గ్రామాలు పరిశుభ్రంగా రూపొందాలి

- ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలి
- జిల్లాలో అక్షరాస్యత పెంపుపై దృష్టి సారించాలి
- 21 ఏళ్ల లోపు ఏ బాలికకూ వివాహం జరిగేందుకు వీల్లేదు
- డి.ఆర్.సి. సమావేశానికి పూర్తి సమాచారంతో రండి
- ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీమతి సూర్యకుమారి



విజయనగరం (విజయభాను న్యూస్) : మన జిల్లా అక్షరాస్యతలో వెనుకబడి వుందని, జిల్లాలో అక్షరాస్యత పెంపొందించే దిశగా జిల్లా అధికారులు, యంత్రాంగం సమిష్టి కృషిచేయాల్సి వుందని జిల్లా కలెక్టర్ ఏ.సూర్యకుమారి పేర్కొన్నారు. ముఖ్యంగా వయోజన నిరక్షరాస్యత అధికంగా ఉన్నందున ఆయా వర్గాల వారిలో కనీస స్థాయిలో ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించే దిశగా ప్రయత్నాలు చేయాల్సి వుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేకాధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడారు. స్కూలుకి వెళ్తూ మధ్యలోనే చదువుకు స్వస్తిపలికిన 18 ఏళ్ల లోపు బాలబాలికలను గుర్తించి వారిని బ్రిడ్జి కోర్సుల ద్వారా మళ్లీ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించే ప్రయత్నం చేయాలన్నారు. ఆయా మండలాల్లో బడి మానివేసిన పిల్లలను వెంటనే గుర్తించి తనకు నివేదిక అందజేయాలని కోరారు. సఖి గ్రూపులను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారని, ఆయా గ్రూపులు నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపట్టేలా, సమావేశాలు క్రమంతప్పకుండా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. బాలికల్లో విద్య, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించి వారికి 21 ఏళ్ల వయస్సులోపల వివాహం జరగకుండా నిరోధించడమే ఈ గ్రూపుల ఏర్పాటు ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ గ్రూపుల ఏర్పాటు ఉద్దేశ్యాలు నెరవేర్చేలా మండల స్థాయి అధికారుల్లో అవగాహన కలిగించాలన్నారు. గ్రామాలన్నీ పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా వేస్తూ చెత్త సేకరణలో సహకరించినపుడే ఇది సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో ఈ విధానంలో చెత్త సేకరణ జరుగుతున్నదీ లేనిదీ పర్యవేక్షణ చేయాలని కోరారు. ప్రతిరోజూ గ్రామంలో ఉదయాన్నే చెత్త సేకరణ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో నిర్మించిన ఘన వ్యర్థాల శుద్ధీకరణ యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేసిన వర్మీకంపోస్టును రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారుల ప్రక్కనే చెత్తకుప్పలు వేస్తున్నారని, దీనివల్ల జిల్లా ప్రతిష్ట దెబ్బతింటుందని, అందువల్ల ఆయా గ్రామాల్లో రహదారుల పక్క చెత్తవేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారుల కృషివల్ల గత నెలలోనే ఏడు వేల ఇళ్ల నిర్మాణం ప్రారంభమయ్యిందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో వివిధ దశల్లో వున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆ తదుపరి దశలకు తీసుకువెళ్లేలా చొరవ చూపాలన్నారు. కోవిడ్ వ్యాక్సినేషన్‌లో 12 ఏళ్లు పైబడిన వారికి రెండు విడతల్లో, 50 ఏళ్లు పైబడిన వారికి మూడో విడత వ్యాక్సిన్ వేయడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లా సమీక్ష సమావేశానికి జిల్లా స్థాయి విభాగాధిపతులే రావాలని, తమ సహాయక అధికారులను పంపించవద్దని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలన్నారు.

# సేవా, అంకితభావంతో సేవలను అందిస్తున్న నర్సులు

- 33వ క్యాపింగ్ సెర్ మనీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్




విశాఖపట్నం (విజయభాను న్యూస్): సేవా భావం, అంకితభావంతో విలువైన సేవలను అందించగల గొప్ప మనసున్న వారు నర్సులు అని ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. వి.యం.ఆర్.డి.ఎ ఏరీనా చిల్డ్రన్ థియేటర్లో సెయింట్ జోసఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ వారి ఆధ్వర్యంలో నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాపింగ్ ప్రధానం మేయర్ హరి వెంకట కుమారి, పార్లమెంటు సభ్యులు ఎం వి వి సత్యనారాయణ , పలువురు పెద్దలలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ వారితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ నర్సులు పాత్ర చాలా కీలకమని, వారు ఎంతో సేవా దృక్పథంతో అంకితభావంతో తమ వృత్తిని చేపడతారని అన్నారు.

కారోన లాంటి విపత్కర పరిస్థితుల్లో నర్సులు సేవలను వెలకట్టలేమని అలాగే నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సేవా భావంతో పని చేయాలని, ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సా స్ఫూర్తి తో తమ వృత్తిని స్వీకరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సైన్స్ జోసఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ తో పాటు డి.ఎం. డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీత, వార్డ్ ఇంచార్జ్ పల్లా దుర్గారావు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐ లవ్ మై డాడ్ షో పోస్టర్ ఆవిష్కరించిన బుల్లితెర హీరో మధుసూదన్




విశాఖపట్నం (విజయభాను న్యూస్): ప్రముఖ బుల్లితెర హీరో కళ్యాణం కమనీయం, కథలో రాజకుమారుడు, గోరంత దీపం ఫేమ్ మధుసూదన్ మరియు సినిమా నటి లక్ష్మి శ్రీ, వీరుమామ ఆఫీస్ లో జూన్ 19న జరగనున్న ప్రత్యేక కార్యక్రమం "మై డాడ్ " పోస్టర్ ఆవిష్కరించారు. వీరుమామ చేసే ప్రతి కార్యక్రమం వినూత్నం గా ఉంటాయని, ఎంతో క్రియేటివ్ గా అలోచించి అందులో సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని ఒక సినిమా స్టైల్ లో ప్లాన్ చేస్తారని హీరో మధుసూదన్ అన్నారు. అలాగే విశాఖ ను ప్లాస్టిక్ ఫ్రీ నగరం గా చేయటంలో అందరు బాగసామ్యం అవ్వాలని కోరారు. కార్యక్రమం లో ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ మరియు సిబ్బంది పాల్గొన్నారు. మై డాడ్ అనే కార్యక్రమం లో ప్రతి తండ్రి పాల్గొని విజయవంతం చేయాలని, పాల్గొనాలి అనుకునే వారు 9912999949 లో తమ పేర్లు ఉచితంగా నమోదు చేసుకోవొచ్చని నటి లక్ష్మి శ్రీ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. ముఖ్యమంత్రి గారి సూచనలు, సలహాల మేరకు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం కోసం నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు. రాజ్యసభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు 9 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 50 శాతానికి పైగా బీసీలు అంటే, 5గురు సభ్యులు ఉన్నారు. అంటేనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. లోక్ సభలో 21 మంది సభ్యులతో కలిపి, మొత్తం 30 మంది పార్లమెంటు సభ్యులు రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా పోరాడతాం. మేమంతా సమిష్టిగా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతాం. కలిసి పనిచేస్తాం.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎజెండాను పార్లమెంటులో వినిపిస్తాం. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తాం. రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యం. వైఎస్ రాజారెడ్డి దగ్గర నుంచి మహానేత వైఎస్ఆర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ మోహన్ రెడ్డి వరకు, గత మూడు తరాలుగా ఆ కుటుంబానికి సేవలు అందిస్తున్న తనకు, రాష్ట్రానికి, ప్రజలకు సేవలందించే భాగ్యం కల్పించిన ఆ కుటుంబానికి సదా కృతజ్ఞుడునై ఉంటానన్నారు.

రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు అన్నింటా వెన్నెముకగా నిలుస్తూ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీలంతా జగన్ కి కృతజ్ఞతగా ఉంటారు.

ఇంతకాలం బీసీలకు అవి చేస్తాం.. ఇవి చేస్తాం.. అని మాటలు చెప్పి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే రాజకీయ నాయకులనే చూశాం. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక, బీసీల సంక్షేమం, ఆ వర్గాలకు రాజ్యాధికారం అన్నది మాటల్లో కాకుండా.. చేతల్లో అమలు చేసి చూపిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన బీసీ వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర పేద వర్గాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ లో అమలవుతున్న సంక్షేమ పథకాలుగానీ, ఇక్కడ అమలు అవుతున్న రాజకీయ రిజర్వేషన్లుగానీ దేశానికే మార్గదర్శకంగా నిలిచాయి. ఈ వర్గాల అభ్యున్నతికి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న కృషి దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ లో పేద కులాలంతా ఈరోజు ఉచితంగా చదువుతున్నారు. అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన... లాంటి పథకాలు ఎన్నో అమలు చేస్తూ, పేదలకు కార్పొరేట్ కు దీటుగా, ఉచితంగా విద్య అందించడం ద్వారా, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడిగా మారుతుందని నమ్మిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డిగారు. 1వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుల వరకు పేదలకు ఉచితంగా చదువు అందించడం ద్వారా.. ఆ వర్గాలు శాశ్వతంగా అభివృద్ధి సాధించడంతోపాటు, ఆ కులాల గౌరవం కూడా పెరుగుతుంది. ఆ కులాలు అభివృద్ధి చెందడం ద్వారా, ఆ వర్గాల మానవ వికాసానికి , సమాజ ప్రగతికి ఎంతగానో దోహదపడుతుంది.

బీసీలంటే... బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ అని గొప్పగా భావించి, ఆ విధంగా ఆ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు జగన్ మోహన్ రెడ్డి. ఇందులో భాగంగానే సీఎం ఆదేశాల మేరకు పార్లమెంటులో విజయసాయిరెడ్డి ప్రత్యేకంగా బీసీ బిల్లు పెట్టారు. అణగారిన వర్గాల అభివృద్ధికి జగన్ విజన్ ను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలి. ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమ కార్యక్రమాల ద్వారా వెనుకబడిన కులాలకు గౌరవం, అధికారం కల్పించిన నాయకుడు జగన్. బీసీ కులాల అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిగా జగన్ శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోతారన్నారు.వెనుకబడిన, పేద కులాల పక్షాన పార్లమెంటులో గొంతెత్తి పోరాడటానికి, ఆ కులాల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకు రావడానికి జగన్ గారు తనకు అవకాశం కల్పించినందుకు సదా కృతజ్ఞతతో ఉంటాం.

రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ..

భారతదేశంలో అత్యున్నతమైన ఎగువ సభ రాజ్యసభకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున నలుగురు సభ్యులు ఎంపికైతే, వారిలో ఇద్దరు బీసీలను ఎంపిక చేసిన సీఎం జగన్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వెనుకబడిన వర్గాలకు సామాజిక, ఆర్థిక అంశాలతోపాటు రాజకీయంగా ఉన్నతమైన అవకాశాలు కల్పించడం ద్వారా, ఆ వర్గాలు అభివృద్ధి చెందుతాయని నమ్మి మాకు అవకాశం కల్పించిన జగన్ మోహన్ రెడ్డి బీసీల హృదయాల్లో శాశ్వతంగా చెరగని ముద్ర వేసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల తరఫున జగన్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి బేషరతుగా వచ్చాను. రాజ్యసభ సభ్యత్వం వస్తుందని నేను ఆశించలేదు. నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా, రాష్ట్ర, పార్టీ ప్రయోజనాలను కాపాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాను.నా చిన్ననాటి మిత్రుడు, పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఉన్న విజయసాయిరెడ్డి సహకారం మరువలేను.

రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా రూ. 1.46 లక్షల కోట్లను సంక్షేమ పథకాలకు మళ్ళించడం సీఎం జగన్ కే సాధ్యమైంది. సంక్షేమ పథకాలకు లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే.. ఇదేదో నేరం అన్నట్టుగా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, పేదవాడికి ఈ ప్రభుత్వంలో మంచి జరుగుతుంటే గర్వంగా చెప్పుకోవాలే గానీ, నిందలు వేయడం సరికాదన్నారు.

# జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ త్వరతగతిన పూర్తిచేయాలి

ఎందుకు పరిశీలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెడ్డలు, వాగులు , పోరంబోకు భూములను మినహాయించి లేఅవుట్లు రూపొందించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేయాలని ఆదేశించారని, కావున ప్రతి అధికారి భాద్యతాయుతంగా పని చేయాలన్నారు. కోర్టు కేసులతో పెండింగ్ ఉన్నవి మినహా మిగిలిన భూములను సిద్దం చేసి పంపిణి చేయాలనీ ఆదేశించారు. ప్రతి లబ్ధిదారునికి భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు లేకుండా స్పష్టమైన హక్కు పట్టాను అందజేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, జీవీఎంసీ కమీషనర్ లక్ష్మీషా , డి ఆర్ ఓశ్రీనివాసమూర్తి, ఆర్ డి ఓ హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్లు ,మండల అభివృద్ధి అధికారులు , జోనల్ కమిషనర్లు ఇతర సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## రిమోట్ సర్వీస్ ప్రొవిజన్

# 'మల్టీపర్పస్ మొబైల్ క్లినిక్ మరియు వర్క్‌షాప్ ప్రారంభం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ది ఎబిలిటీ పీపుల్ కాన్‌సెంట్రిక్స్ దక్ష్ సర్వీసెస్ ఇండియా మద్దతుతో కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా రిమోట్ సర్వీస్ ప్రొవిజన్ 'మల్టీపర్పస్ మొబైల్ క్లినిక్ మరియు వర్క్‌షాప్'ని ప్రారంభించారు.

మహమ్మారి వంటి ప్రతికూల పరిస్థితులలో కూడా, పిల్లలు మరియు వికలాంగుల అవసరాలను తీర్చడానికి కేంద్రం నుండి 100 కిలోమీటర్ల పరిధిలో మొబైల్ క్లినిక్‌ను అందుబాటులో ఉంచవచ్చు. మొబైల్ క్లినిక్ ఇంటింటికీ సేవలను అందించడానికి అవసరమైన సెటప్‌తో అమర్చబడి ఉంటుంది మరియు మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు లేదా వివిధ కారణాల వల్ల మమ్మల్ని చేరుకోలేని వారికి చేరుకోవచ్చు. వీల్‌చైర్లు మరియు స్ట్రెచర్‌లపై వినియోగదారుల రవాణా కోసం సంస్థాగత మరియు కమ్యూనిటీ పునరావాస కార్యక్రమాలకు కూడా ఇది అందుబాటులో ఉండే మొబైల్ సేవగా ఉద్దేశించబడింది. ఇది రోడ్డు ప్రమాద బాధితులకు అందుబాటులో ఉండే పరికరాలు మరియు పునరావాస సేవలు మరియు ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలు మరియు తీర ప్రాంతాలలోని పిడబ్ల్యూడిల జీవితాలపై స్థిరమైన ప్రభావాన్ని సృష్టించేందుకు సమాజంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు అభివృద్ధి సహాయాలను కూడా కలిగి ఉంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దీపక్ వాధావన్, కాన్‌సెంట్రిక్స్ జివిపి ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ వారు మరియు ప్రత్యేక అతిధులు గా కె.జగదీష్, అసిస్టెంట్ డైరెక్టర్, వికలాంగుల వ్యవహారాలు, విశాఖపట్నం, స్వామి దివ్యబోధానంద జీ మహారాజ్, సిపి క్లినిక్ ఇంఛార్జి, ఆర్.కె .మిషన్, విశాఖపట్నం, మన్మయ పాండబ్, డిజిఎం, ఎస్‌బిఐ, విశాఖపట్నం, యు.ఎస్.శర్మ, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం పోర్ట్ సిటీ అధ్యక్షుడు, శ్రీనివాస్, ఎంవిఐ, ఆర్‌టిఏ, పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి

# జాతీయ సమైక్యతా శిబిరాలు దోహదం



గాజువాక (విజయభాను న్యూస్): భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించ డానికి జాతీయ సమైక్యతా శిబిరాలు దోహద పడతాయని సెయింట్ ఆన్స్ సొసైటీ అసిస్టెంట్ సుపీరియర్ జనరల్ సిస్టర్ ఆన్ మేరీ అన్నారు. సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక వలంటీర్ కుమారి కె.లావణ్య పంజాబ్ లోని పాటియాలా జిల్లాలో గల రాజ్ పుర లో గల చిత్కార యూనివర్సిటీలో మే 20 నుండి 26 వరకు జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని వచ్చిన సందర్భంగా బుధవారం మల్కాపురం లో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ-దేశ ఐక్యతకు, సమగ్రతకు, భారత సంస్కృతిని అర్థం చేసుకోవడానికి జాతీయ సమైక్యత శిబిరాలు అవసరమని అన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ - ఇంత చక్కని జాతీయ అవకాశం సెయింట్ ఆన్స్ వలంటీర్ కు రావడం గర్వకారణమని అన్నారు. అభినందన సమావేశంలో జాతీయ సేవా పథక జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఇతర ప్రోగ్రాం అధికారులు వై.అనసూయదేవి, వి. అంజలీదేవి, వలంటీర్లు పాల్గొన్నారు. ఈ క్యాంపు వల్ల అన్ని రాష్ట్రాల ఆచార వ్యవహారాలు, సంస్కృతి అర్థం అయ్యాయని, ఇది జీవితంలో ఒక మధురానుభూతి అని శిబిరంలో పాల్గొన్న లావణ్య అన్నారు.



# కరాటే దుస్తులు అందజేత

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ గ్రహీత బంగారు పరదేశి, మరియు బంగారు గౌతమ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుకు వై..సి.పి సీనియర్ నాయకులు చిల్ల హరి రెడ్డి (తాళ్లవలస)15 మంది పిల్లలకు కరాటే డ్రెస్సులు పదివేలు స్పాన్సర్ చేసారు. ఈ కార్యక్రమంలో... శ్రీనివాస రెడ్డి, జీవీ ఎంసీ 1వ వార్డ్ ప్రచారకమిటీ అధ్యక్షులు తమ్మిన అశోక్,బోణి ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విభాగాలలో ఆకస్మిక తనిఖీలు

**- పరీక్ష కేంద్రాల పరిశీలన**
**-విభాగానికి హాజరుకాని పరిశోధకులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశం**
**- రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్**



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్



హాజరు పట్టికలు తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్

ఏయూ (విజయభాను న్యూస్) ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పలు విభాగాలను పరీక్ష కేంద్రాలను రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆచార్యులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా, సకాలంలో హాజరు కావాలని స్పష్టం చేశారు. విధినిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని చెప్పారు. అనంతరం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో, పటిష్టంగా పరీక్షలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పరిశోధకులపై ఆగ్రహం..... కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో పలువురు పరిశోధకులు సక్రమంగా హాజరు కాకపోవడం రిజిస్ట్రార్ గమనించారు. ఫుల్‌టైం పరిశోధకులు విధిగా విభాగాలకు హాజరు కావాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా మూడు రోజులు గైర్హాజరు అయిన వారిని వివరణ కోరాలని, వరుసగా రెండు వారాలు విభాగానికి హాజరుకాని పరిశోధకుల పేర్లు తొలగించాలని సూచించారు. సమగ్ర నివేదికను ప్రిన్సిపాల్‌కు పంపాలన్నారు. ఫుల్‌టైం పరిశోధకులుగా ప్రవేశం పొందినవారు తరువాతి కాలంలో ఉద్యోగాలు పొందితే పార్ట్‌టైంకు మార్చుకోవాలని, లేని పక్షంలో వారి పేర్లు తొలగించాలని విభాగాధిపతిగా స్పష్టం చేశారు.

# మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**- 115వ సారి రక్త దానం చేసిన జవహర్**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించడం అభినంద నీయమని, యువత రక్తదానం చేసేందుకు మరింత ముందుకు రావాలని ఆర్.కే టౌన్ షిప్ చైర్మన్ ఎం.ఎం. కొండయ్య పిలుపునిచ్చారు. డైమండ్ పార్క్ జంక్షన్ వద్ద ఉన్న కార్యాలయంలో అర్.కే. టౌన్ షిప్ గ్రూప్ సంస్థ 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన సంస్థ మేనేజర్ వంకాయల జవహర్ 115వ సారి రక్తదానం చేశారు. ఈ మేరకు ఆయనను సంస్థ చైర్మన్ కొండయ్య, ఎండి, ఎంజి అమర్ నాథ్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరు రక్త దానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చునని, ప్రస్తుతం వేసవి కాలంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు కొరత ఎక్కువగా ఉందని వెల్లడించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చునని, అపోహలు వీడి ముఖ్యంగా యువత ముందుకు రావాలని కోరారు. సేవా కార్యక్రమంలో భాగంగా సామాజిక బాధ్యతతో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి, ఆర్కె టౌన్షిప్ సంస్థ సిబ్బంది కె వెంకట్, బాలాజీ, వేణు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అరకులోయ ఎస్బిఐ బ్యాంక్ నందు బారులు



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలో గల ఎస్బిఐ బ్యాంకు నందు ఖాతాదారులు నెల మొదటి రోజు నుంచి వరకు 25 రోజులు ఎప్పుడు సూచించిన పడిగా పులే నంటూ ఖాతా దారులు వాపోయారు ఎటువంటి అత్యవసర బ్యాంకు పనుల్లో ఎప్పుడు వెళ్లినప్పటికీ కూడా కాళీ ఉండడంలేదని ఊరు వాపోయారు బ్యాంకుల్లో ఆధార్ లింకు ఇవ్వకపోవడంతో ప్రతి పని మీద ఆధార్ లింకు ఉండాలనే ఒకపక్క ప్రభుత్వం అనడంతో గిరిజన రైతులు ఆధార్ లింకు కోసం రోజు పనులు మానేసి కొని బ్యాంకి వద్దకే కాపు కాస్తున్నట్లు వృద్ధులు వాపోయారు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న మని ఆవేదన వ్యక్తపరిచారు.

# మహిళా పోలీసులకు వర్క్ షాప్



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక పోలీస్ స్టేషన్ సి ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు జ్యూవెనల్ జస్టిస్ యాక్ట్ పై (పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం) చిన్నబజారు రేలంగి పెదబాబు కల్యాణ మండపం లో శుక్రవారం వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ శరత్ బాబు, లేబర్ ఆఫీసర్ ప్రసాద్,గీతం కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దీపా మోహన్, భీమిలి సి.ఐ వెంకట రమణ,ఎస్.ఐ సంతోష్ కుమార్ లు మహిళా పోలీసులుకు అవగాహన కల్పించారు.బాల్య వివాహాలు అరికట్టాలని, బాల కార్మికులను రక్షణ, పిల్లలు బాల్య నేరాలకు పాల్పడకుండా సరైన సంరక్షణ చేయాలనీ, వారికి సరైన చికిత్స అందించాలని, సాంఘిక పునర్నిర్మాణం ద్వారా పిల్లలు ప్రాథమిక అవసరాలను గుర్తించి వారి అవసరాలను తీర్చా లని, పిల్లలకు సంబంధించిన చట్టాన్ని ఏకీకృతం చేయడానికి, సవరించడానికి ఒక చట్టం చేయాలని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారి పునరావాసం కోసం పిల్లలు స్నేహపూర్వక విధానాన్ని అవలంబించడం కోసం ఈ చట్టం రూపొందించబడిందని వివరించారు. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మగవారితో సమానంగా ఈ వృత్తిని ఎంచుకున్నందుకు గాను మహిళా పోలీసు లను సిఐ వెంకట రమణ ప్రత్యేకంగా అభినందించారు.


# ఘనంగా లక్ష కుంకుమ పూజా కార్యక్రమం





పరవాడ (విజయభాను న్యూస్ : కందుకూరి విశ్వనాధశాస్త్రీ ఆధ్వర్యంలో ఘనంగా లక్ష కుంకుమ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి, పరవాడ వెన్నెలపాలెం జంక్షన్ లో గల శ్రీదత్త సంతోషి సత్య దేవ త్రయంబకేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, నవ గ్రహ దేవాలయంలో శుక్రవారం లక్ష కుంకుమ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిం చారు. దేవాలయం 27వ వార్షి కోత్సవ సందర్భంగా అందుకూరి విశ్వనాధ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగాయి. కుంకుమ పూజలలో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల మెరిట్ జాబితా



మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచుతున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్ర యూనివర్శిటీ (విజయభాను న్యూస్): ఆంధ్రవిశ్వవిద్యాలయం వివిధ ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో మెరిట్ జాబితాను ఆంధ్రవిశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో పొందుపరిచారు. 31-7-2021న జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు సంబంధించిన మెరిట్ జాబితాను శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి బటన్ నొక్కి జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, కంప్యూటర్ సెంటర్ సంచాలకురాలు ఆచార్య కె.రమాసుధ, డిప్యూటి రిజిస్ట్రార్ ఎల్. మంజుల తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ప్రాంతీయ భాషలకు అన్యాయం

అఖిల భారత స్థాయి అధికారులుగా ప్రజాసేవ చేయడానికి మార్గం సివిల్ సర్వీస్ పరీక్షలు. వాటిలో విజయం సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంతోమంది అభ్యర్థులు కలలు కంటుంటారు. అందుకోసం అహో రాత్రాలు శ్రమిస్తారు. జూన్ అయిదున యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ప్రాథమిక పరీక్ష (ప్రిలిమ్స్)ను నిర్వహించనుంది. మొదటి నుంచీ ప్రాథమిక పరీక్షను కేవలం ఆంగ్లం, హిందీ భాషల్లోనే జరుపుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణాదితో పాటు పలు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల అభ్యర్థులు సివిల్స్ ప్రిలిమ్స్‌ను ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రాంతీయ భాషల్లో చదువుకొని హిందీ, ఆంగ్లంపై సరైన పట్టులేని అభ్యర్థులు నష్టపోతున్నారు. భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో 22 భాషలను అధికారికంగా గుర్తించారు. అఖిల భారత స్థాయి అధికారుల ఎంపికలో తొలి మెట్టు అయిన సివిల్స్ ప్రిలిమ్స్‌ను కేవలం ఆంగ్లం, హిందీలలోనే నిర్వహించడం ప్రాంతీయ భాషలపట్ల దుర్విచక్షణే! ఉద్యోగ, ఉపాధి విషయాల్లో ఎలాంటి దుర్విచక్షణా ఉండకూడదని రాజ్యాంగంలోని 16వ అధికరణ చెబుతోంది. సివిల్స్ ప్రిలిమ్స్ విషయంలో యూపీఎస్సీ, కేంద్రం తీరు- ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగి, ప్రాచీన హోదా పొందిన తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, ఒడియా వంటి భాషల్లోనూ సివిల్స్ ప్రాథమిక పరీక్షను నిర్వహించకపోవడం సరైనదికాదు. పేద పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదువుతారు. ఇటీవలి కాలంలో సర్కారు బడుల్లోనూ ఆంగ్లంలో విద్యాబోధన ప్రారంభమైంది. నిన్నమొన్నటిదాకా దాదాపు అన్ని పాఠశాలల్లో ప్రాంతీయ భాషల్లోనే బోధన సాగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆంగ్లంపై సరైన పట్టు ఉన్నవారు చాలా తక్కువగానే కనిపిస్తారు. ఈ నేపథ్యంలో సివిల్స్ ప్రాథమిక పరీక్షను కేవలం ఆంగ్లం, హిందీలలోనే నిర్వహించడం- అలాంటి వారి పట్ల అన్యాయమే.

సివిల్స్ ప్రధాన పరీక్ష (మెయిన్స్) రాయడానికి రాజ్యాంగం గుర్తించిన భాషల్లో ఏదో ఒకటి ఎంచుకోవడానికి అవకాశం ఉంది. అలాంటప్పుడు ప్రాథమిక పరీక్షను ప్రాంతీయ భాషల్లో ఎందుకు నిర్వహించకూడదన్న సందేహం తలెత్తుతుంది. మరోవైపు మెయిన్స్ పరీక్షలను ప్రాంతీయ భాషల్లో రాసే అవకాశం ఉన్నా, సరైన పాఠ్య సామగ్రి అందుబాటులో లేదు. అందువల్ల అతి తక్కువ మంది మాత్రమే ప్రాంతీయ భాషల్లో మెయిన్స్‌కు హాజరవుతున్నారు. యూపీఎస్సీ లెక్కల ప్రకారం 2020లో తెలుగులో మెయిన్స్ వ్యాసం, జనరల్ స్టడీస్ పరీక్షలను రాసినవారు నలుగురు మాత్రమే. తమిళం అభ్యర్థులు 25 మంది కనిపిస్తారు. గుజరాతీ, మరాఠీలో 40 మందికి పైగా ప్రాంతీయ భాషను ఎంచుకున్నారు.

ప్రిలిమ్స్ ప్రాథమిక పరీక్షను ప్రాంతీయ భాషల్లో నిర్వహించేలా చూడాలని అభ్యర్థులు యూపీఎస్సీ, కేంద్ర ప్రభుత్వాలను కోరుతున్నా సరైన స్పందన ఉండటంలేదు. ఈ విషయంలో తమిళనాడు ప్రజాప్రతినిధుల చొరవ మెచ్చుకోదగినది. సివిల్స్ అభ్యర్థుల కోసం పలుమార్లు అసెంబ్లీ, పార్లమెంటులో వారు గళం వినిపించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయంలో స్పందించాలి. ప్రసార మాధ్యమాల్లోనూ దానిపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఆయా రాష్ట్రాల నుంచి అఖిల భారత స్థాయి అధికారులుగా అనేక మంది ప్రతిభావంతులు ఎదగడానికి ఆస్కారం ఉంది. అలాంటి వారికి సివిల్స్ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. వారికోసం అవసరమైన శిక్షణా సంస్థలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలి. ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన పాఠ్య సామగ్రిని అందు బాటులోకి తేవడమూ అత్యంత కీలకం. కేవలం యూపీఎస్సీనే కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) తదితర పరీక్షలనూ ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలి. ఉపాధి, ఉద్యోగం పొందడంలో ప్రాంతీయ భాష ఎన్నటికీ అవరోధం కాకూడదని రాజ్యాంగం చెబుతోంది. ఆ అంశాన్ని గుర్తించి స్థానిక భాషల్లో పోటీ పరీక్షలను నిర్వహించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన అవసరం ఉంది.

# ఏంఎమ్మెల్సీ అనంతబాబు కేసు పై సిబిఐ విచారణ చేపట్టాలి

- అతని శాసన మండలి ను రద్దు చేయాలి
- డాక్టర్ బి ర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొనసాగించాలి
- గవర్నర్ ను కోరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



విజయవాడ ( విజయభాను న్యూస్) : దళిత యువకుడిని హత్య చేసిన ఏంఎమ్మెల్సీ అనంత బాబు ఘటనపై సిబిఐ విచారణ జరిపించాలని అయన శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ కోరారు .శుక్రవారం ఉదయము సిపిఐ రాష్ట్ర ప్రథినిది బృందం మాజీ ఏంఎమ్మెల్సీ ,పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు ,దోనేపూడి శంకర్ ,డి హెచ్ పీ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు ,రాయప్ప తో కూడిన పార్టీ ప్రతినిధి బృందం గవర్నర్ ను కలిసి వినతి పత్రం అందజేసేసింది .పలు అంశాలను రామకృష్ణ ఆయనకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రము లో పదే పదే దళిత ,మహిళలపై దాడులు, హత్యలు ,మానభంగాలు జరుగుతున్న ప్రభుత్వానికి చలనం లేదని అన్నారు.

గతం లో బీహార్ మాదిరిగా నేడు రాష్ట్రము లో శాంతి భద్రతలు క్షిణించాయని తెలిపారు .లేకుంటే ఏంఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ ను హత్య చేసి తన కారులోనే తీసుకువచ్చాడంటే జగన్ ప్రభుత్వం ఎలా ఉందొ అర్ధం చేసుకోవచ్చు అన్నారు .డాక్టర్ సుధాకర్ మొదలు కుని సుబ్రహ్మణ్యం వరకు దళిత ల పై ఇన్ని అరాచకాలు జరుగుతున్న ఒక్కసారి కూడా జగన్ నోరు విప్పలేదని విమర్చించారు .కాకినాడ పోలీస్ లపై నమ్మకం లేదని ఈ ఘటన పై సిబిఐ విచారణ చేయాలనీ కోరారు. త్వరలో దళితుల సమస్యలపై రాష్ట్ర వర్క్ షాప్ నిర్వహిస్తామని రామకృష్ణ అన్నారు.

# ప్రధాని మోదీ క్రీడలకు, క్రీడాకారులకు అన్ని విధాలా సహకరిస్తున్నారు

- ఇండియన్ కిక్ బాక్సింగ్ ఇండియా లీగ్ ప్రారంభించిన ఎంపి జీవిఎల్, ఎమ్మెల్సీ మాధవ్




మద్దిలపాలెం (విజయభాను న్యూస్): స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కిక్ భాక్సింగ్ ఇండియా లీగ్ ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా ఎంపి (రాజ్యసభ ) జివిఎల్ నరసింహారావు గౌరవ అతిదిగా ఎం.ఎల్.సి పివిఎన్ మాదవ్ మేడపాటి రవీంద్ర పాల్గొని ప్రారంబించారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి. నరసింగరావు అధ్యక్షత వహించగా మొదటిగా వాకో ఇండియా జాతీయ అధ్యక్షులు సంతోష్ కుమార్ అగర్వాల్ అతిదులందరికి ఆహ్వానంపలికారు. వివిధ రాష్ట్రాల నుంచి మూడు వందల మంది కిక్ బాక్సర్ పాల్గొన్నారు.ఎంపి జివిఎల్ నరసింహారావు బౌట్ కొట్టి క్రీడలను ప్రారంబించారు. ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతూ దేశ ప్రదాని నరేంద్ర మోదీ క్రీడలకు క్రీడాకారులకు అన్ని విదాల ప్రోత్సహించడం వలన ఈమద్య జరిగిన ఒలింపిక్ క్రీడలలో ఏడు మెడల్సు సాధించామని అన్నారు. కేంద్రప్రభుత్వం తరపున క్రీడాకారులకు అన్నివాదాల సహాయం చేయడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నిర్వాహకులు కరణంరెడ్డి నరసింగరావుని అద్యక్షులు సునీల్ కుమార్ దుర్గ సతీశ్ లను అభినందించారు. నరసింగరావు మాట్లాడుతూ మొదటి సారిగా తమకు అవకాశం ఇచ్చిన జాతీయ అద్యక్షులు సంతోష్ కే అగర్వాల్ దన్యవాదాలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ఇరవై వేల నగదు బహుమతి బెల్టు అందజేస్తామని వచ్చే నెలలో ఉజిబికిస్తాన్ లో జరగబోయే అంతర్జాతీయ స్థాయి పోటీలకు కూడ పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి రామ్ రవికుమార్ ఆనందబాలు సిరసపల్లి నూకరాజు పుష్పలత రోహిణి నాగేశ్వరరావు భువనేశ్వరి గీతా సింగ్ తదితరులు పాల్గొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు వీర్యక్షకులను ఆకట్టుకున్నాయి.

## కవి సమయం

### స్నేహితుడు

నా స్నేహితుడు వరం
మూడ్ ఎప్పుడూ గరం గరం
గర్ల్‌ఫ్రెండ్‌తో ఆడుతుంటాడు సరసం
చదువంటే విరసం
నచ్చిన వంటకం పాయసం
ఎప్పుడూ చెప్పించుకుంటాడు జోస్యం
బలాదూర్ గా తిరగడం ఇష్టం
తెస్తాడు ఇంటికెంతో కష్టం
చేసిన ప్రతీ వ్యాపారంలో నష్టం
ఏ పనికి వుండకూడదు ఇష్టం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి: పంచమి రా.12.46; పుష్యమి సా.6.43; వర్జ్యము లేదు

శనివారం 04 -06-2022

a **మేషం** : దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహ కారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం.

b **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.

c **మిథునం** : కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం.

d **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం.

e **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.

f **కన్య** : భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

g **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం.

h **వృశ్చికం** : నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది.

i **ధనుస్సు** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. కొత్త ఆదాయ మార్గాలు అన్వేషిస్తారు. విలువైన వస్తువులపై దృష్టి సారిస్తారు. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు.

j **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభా కాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.

k **కుంభం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసివస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

L **మీనం** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.



# చంద్రబాబు జీవితమంతా చీకటి పొత్తులు, నక్క జిత్తులే

- జగన్ ఢిల్లీ పర్యటనపై లోకేశ్ వ్యాఖ్యలను తిప్పి కొట్టిన ఎంపి విజయసాయిరెడ్డి

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు రాజకీయ జీవితమంతా పేరుకే పోరాటాలు,నిజానికి చీకటి పొత్తులు,నక్క జిత్తుల వ్యవహారాలతో సాగిందని వైఎస్సార్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

ట్విట్టర్ వేదికగా శుక్రవారం టిడిపి అధినేత చంద్రబాబు, తనయుడు లోకేష్ లపై విరుచుకుపడ్డారు. తెలుగుదేశం పార్టీ స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో అన్ని చోట్లా చిత్తు చిత్తుగా ఓడిపోయాక ఆ పార్టీ యుద్ధనీతి పక్కకు తప్పుకుందన్నారు.వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు అసాధ్యమని ఇప్పటికే వారికి తెలిసొచ్చిందని . ఆ 'కడుపుమంట' తోనే వైఎస్ఆర్ సిపి ప్రభుత్వంపై లేని పోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై టిడిపి నేత లోకేశ్ చేసిన విమర్శలకు ఆయన తీవ్రంగా స్పందించారు.

లోకేశ్ వాళ్ల నాన్న ఏం చెబుతున్నాడంటే... -రాష్ట్రపతి ఎన్నికల్లో తనను పట్టించుకునే వాడు లేడని -సొంత పుత్రుడు పరమశుంఠని -దత్తపుత్రుడి మీదే తనకు ప్రేమని

- ప్రత్యేకహోదాను తాకట్టుపెట్టి ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకున్నానని -పోలవరంను ఏటీఎంగా మార్చుకున్నపేటీఎం బ్యాచ్ తామేనని లోకేశ్ వాళ్ల నాన్న ఏం చెబుతున్నాడంటే... -అవినీతి కేసుల్లో కానిస్టేబుల్‌తో దర్యాప్తు చేయించినా తనకు యావజ్జీవ జైలు ఖాయమని - ఇప్పుడు తూర్పు తిరిగి దండం పెట్టడం (టీడీపీ) మాత్రమే తాను, తన కొడుకు చేయగలిగిన పని అని -ఎల్లో మీడియా, వ్యవస్థల మేనేజ్‌మెంటే తనకు దిక్కు అని. చంద్రబాబు చెబుతున్నాడని అన్నారు.

# డప్పుగూడలో ఎంపీటీసీ ఆధ్వర్యంలో త్రాగునీటి బోరు



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయ భాను న్యూస్) : మండలం లోని గన్నెల పంచాయతీ పరిధిలో గల డబ్బు గూడా గ్రామంలో పంచాయతీ ఎం పి టి సి బి.లలిత దేవి స్వయాన గ్రామంలో పర్యటించి బోరును వేయించారు గతంలో ఎన్నడూ లేనివిధంగా త్రాగు నీటి సదు పాయం కల్పించిన ఎంపీటీసీ లలితాదేవిని గ్రామస్తులు స్వాగతించారు అనంతరం గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పి ఆమె గ్రామస్తులకు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వార్డు మెంబర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భవనం నిర్మించాలని వినతి



గాజువాక (విజయభాను న్యూస్): నడుపూరు పైడిమాంబ యాత శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ న్యాయవాది అండి బోయిన లక్ష్మీ కు సామాజిక భవనం నిర్మించాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రం అందించారు. గత నలభై సంవత్సరాలుగా 200 కుటుంబాలు సుమారు 600 మంది యాత శెట్టిబలిజ కులస్తులు నడుపూరులో నివసిస్తున్నారని , గ్రామానికి ఇంతవరకు కమ్యూనిటీ హాల్ లేకపోవడం వలన ఏ కార్యక్రమం చేసుకున్న ఎండలో వానల్లో చేసుకునే పరిస్థితి ఉందని , వీధిలో ఉన్న ఖాళీ స్థలంలో గత 40 సంవత్సరాల నుంచి కమ్యూనిటీకి సంబంధించిన కార్యక్రమాలు అన్నీ ఆ స్థలం లోనే చేసుకుంటున్నట్లు సంఘం ప్రతినిధులు తెలియజేసారు. దీని వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ సమస్య పరిష్కరానికి సామాజిక భవనం నిర్మాణం ఒక్కటే మార్గమని ,సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించినట్లు తెలియజేసారు. ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండి బోయిన లక్ష్మీ స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి నియోజకవర్గ ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్ వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పైడిమాంబ యాత శెట్టిబలిజ సంఘం ప్రెసిడెంట్ పీత నాగరాజు సెక్రెటరీ పాత్రుడు, పిత వెంకట్రావు, కె ప్రసాద్, ఎన్ కుమార్ వెంకటేష్ పి రాజు పైడి రాజు నగేష్ కిరణ్ , సంఘ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల పై తుప్పు తీవ్ర ప్రభావం

**-తుప్పు ఖర్చు దేశ జిడిపిలో 4శాతం - ఐజెడ్ఏ సదస్సులో నిపుణులు**



డాక్టర్ కెన్నెత్ డిసౌజా - సాంకేతిక నిపుణుడు, ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్ నిపుణులు డాక్టర్ రాహుల్ శర్మ, డైరెక్టర్ (ఇండియా)

విశాఖపట్నం, (విజయ భాను న్యూస్): తుప్పు పట్టడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా 2.5 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది ప్రపంచ జీడీపీలో 3 నుంచి 4 శాతం, భారత జీడీపీలో 4 శాతానికి సమానమని కార్కాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరోజన్ చెబుతోందని పలువురు నిపుణులు వ్యాఖ్యానించారు. ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌలిక క సదుపాయాలపై తుప్పు భారాన్ని తగ్గించడం అనే అంశంపై నాలెడ్జ్ కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుప్పు పట్టడం వల్ల మౌలిక సదుపాయాలు పాడవ్వడంతో మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని ఇది ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుందని జింక్, దాని వినియోగదారుల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్న ఏకైక పరిశ్రమ సంఘం అయిన ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్, ఈ ఆందోళనలను పరిశీలించడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ జింక్ అసోసియేషన్ సాంకేతిక నిపుణులు డాక్టర్ కెన్నెత్ డిసౌజా, డైరెక్టర్ డాక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయత్నాలు, స్మార్ట్ సిటీస్ మిషన్ వంటి ప్రాజెక్టుల ఫలితంగా భారతదేశంలో మౌలిక సదుపాయాలు భారీగా విస్తరిస్తున్నాయని అదే సమయంలో, భారతదేశం దక్షిణ ప్రాంతంలో నిర్మాణాలకు తుప్పు పట్టే అవకాశం ఎక్కువగా ఉందని, ఇది దేశానికి తీవ్రమైన ప్రమాదాలు, మౌలిక సదుపాయాల నష్టాలకు దారి తీస్తుందన్నారు . దీనికి ఒకటే పరిష్కారం ఉందని ఇనుము కి పూత పూసే గాల్వనైజింగ్ టెక్నాలజీ ద్వారా తప్పును అరికట్టవచ్చని చెప్పారు.

ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా వివిధ విభాగాల అధికారులు, నిర్మాణ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని మౌలిక సదుపాయాల ఆయుర్దాయాన్ని నిర్ధారించడమే కాకుండా ఆర్థిక, పర్యావరణ నష్టాలను కనిష్ఠం చేసే ఒక సమగ్రమైన తుప్పు రక్షణ యంత్రాంగం అవసరాన్ని చెప్పారు. అనేక సమస్యలలో, గాల్వనైజింగ్ టెక్నాలజీలు (ఉక్కు లేదా ఇనుము వంటి మరింత ఉదాత్తమైన లోహానికి జింక్ పూత పూసే ప్రక్రియ), ఇప్పటికే ఉన్న, కొత్త నిర్మాణాలకు పూయడం, గాల్వనైజ్డ్ నిర్మాణాలకు భారతీయ, ప్రపంచ ఉదాహరణలు, స్మార్ట్ నగరాల కోసం పరిష్కార చర్యలపైనా సదస్సులో చర్చించారు.

# బ్రాండిక్స్ కంపెనీ ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి

**- కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని బ్రాండిక్స్ కంపెనీలో గ్యాస్ లీకేజీ ప్రమాదంలో సుమారు 200 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. వీరిని అనకాపల్లిలోని ప్రభుత్వ ఎన్‌టిఆర్ వైద్యశాల మరియు ఉషాప్రైమ్ హాస్పటల్స్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన తీసుకోని దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రమాదానికి గురైన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్న ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వాటిని నివారించడంలో విఫలమౌతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు మంత్రులు, అధికారులు హడావడి చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప వాటిని అరికట్టడంలేదు. కంపెనీ యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సుమారు 2వేల మంది మహిళలు పనిచేసే ఈ పరిశ్రమలో కనీసమైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అతిచౌకగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎకరా ఒక్క రూపాయి కి పొందిన బ్రాండిక్స్ యాజమాన్యం కార్మికులకు భద్రతా ప్రమాణాలు, సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. కనీసవేతనాలు అమలుచేయకుండా అతితక్కువ వేతనాలతో కార్మికులతో పనులు చేయిస్తూ లాభాలు గడిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా అనేది నిరంతరం నిఘావుంచాలని, ప్రమాణాలు పాటించిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

# బాండిక్స్‌లో ఆకస్మికంగా వెలువడిన విషవాయువు

## తీవ్ర అస్వస్థతకు గురైన వందల మంది మహిళా కార్మికులు

***అమ్మోనియా వాయువు లీకేజీ వలన జరిగింది అని పరిశ్రమ యాజమాన్యం అంటున్నారు. సంఘటన సుమారు11 నుండి12 గంటల ప్రాంతంలో జరిగింది. శుక్రవారం మొదటి షిఫ్ట్ లో 3000 మంది హాజరుకాగా వారిలో ప్రమాదం జరిగిన 2వ యూనిట్ లో1800మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.***



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : బాండిక్స్ పరిశ్రమలో గల సీడ్స్ కంపెనీలో ఆకస్మికంగా వెలువడిన విషవాయువు కారణంగా వందల మంది మహిళా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో గర్భవతులు కూడా ఉన్నారు. క్షతగాత్రులను అచ్యుతాపురంలో ఉన్న ఆసుపత్రిలో చేర్చగా వారిలో కొంత మందికి అస్వస్థత అదికమవడంతో వారిని అనకాపల్లి, విశాఖ ఆసుపత్రులకు తరలించారు. భద్రతా ప్రమాణాల లోపం వలనే ఈ సంఘటన జరిగినట్లు కార్మికులు వాపోతున్నారు. పరిశ్రమలో ఎయిర్ కండీసనర్ (ఎసి)నుండి విషవాయువు వెలువడినట్లు కార్మికులు చెబుతున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



*అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో గల బ్రాండిక్స్ (సీడ్స్ విభాగం) గ్యాస్ లీకేజీ ఘటనలో అస్వస్థతకు గురైన కార్మికులను రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు మరియు వాణిజ్యం, సమాచార సాంకేతిక శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎన్టీఆర్ వైద్యాలయం, ఉష ప్రైమ్ ఆసుపత్రిలలో పరామర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు అనంతరం సంఘటనా స్థలం అచ్యుతాపురం బ్రాండిక్స్ (సీడ్స్ ఇంటిమేట్ అపారల్ ఇండియా విభాగం) సందర్శించి బ్రాండిక్స్ ప్రతినిధులను అడిగి సంఘటన వివరాలను ఆరా తీశారు. ఆయనతో పాటు ఎంపీ సత్యవతి ఉన్నారు.*



అచ్యుతాపురంలో గల బ్రాండిక్స్ (సీడ్స్ విభాగం) గ్యాస్ లీకేజీ ఘటనలో అస్వస్థతకు గురైన కార్మికులను ఎన్టీఆర్ ప్రభుత్వ, ఉష ప్రైమ్ ఆసుపత్రిలలో పరామర్శించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ & గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు. బాధిత కుటుంబాలను ఓదార్చి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు.



ఘటన స్థలంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

# వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై పోలీస్ కేసు



హైదరాబాద్ (విజయభాను న్యూస్): వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యపై హైదరాబాద్‌లో పోలీస్ కేసు నమోదైంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో నాన్‌బెయిలబుల్ కేసు నమోదైంది. రౌడీలు, గూండాలతో బెదిరిస్తున్నారంటూ రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూకబ్జాతో పాటు హత్యకు యత్నించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్ కృష్ణయ్యపై 447, 427, 506, 384 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన తొలిరోజే పోలీస్ కేసు నమోదు కావడం విశేషం.

# జగన్ ఢిల్లీ పర్యటన మోసపూరిత పర్యటన

- ఎన్ని సార్లు మోడీ ని కలిసిన రాష్ట్ర కోసం చేసింది ఏమైనా ఉందా..
- పోలవరం, రైల్వేజోన్, లోటుపాట్లు కోసం చర్చించి ఏమైనా సాదించారా...
- విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కూడా ఉద్యమ డ్రామా చేశారు.
- జగన్ బీజేపీ కి దత్తపుత్రుడు గా సీఎం జగన్

**- మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటన మోసపూరిత పర్యటన అని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఎద్దేవా చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో గడిచిన మూడు సంవత్సరాలుగా పాలన రివర్స్ గా కొనసాగిందని బండారు అన్నారు.

విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అంటూ ఎన్ని సార్లు మోడీ ని కలిసిన రాష్ట్ర కోసం చేసింది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. పోలవరం, రైల్వేజోన్, లోటుపాట్లు కోసం చర్చించి ఏమైనా సాదించారా. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు గా పేరుగాంచిన విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కూడా ఉద్యమ డ్రామా చేశారు. సీఎం జగన్ బీజేపీ కి దత్తపుత్రుడు గా మరి రాష్ట్ర ప్రయోజనాలను మంట కలుపుతున్నారు అని అన్నారు.25 ఎంపీ సీట్లు వస్తే కేంద్రం మెడలు వచుతాం అన్నారు.. ఇప్పుడు జగన్ మోడీ పాదాలు మొక్కతున్నారు.ప్రత్యేక హెూదా కోసం వైసీపీ మద్దత్తు ఇస్తాను అని మోడీ తో చెప్పాలి కదా.సీఎం జగన్ అవినీతిపరుడు అని అన్నారు.జగన్ రాష్టాని తన సొంతనికి వాడుతున్నారు. చరిత్రలో ఇంత దిగజారుడు రాజకీయం ఎప్పుడు చూడలేదు.

సీబీఐ కేసులు, బాబ్బయ్ హత్యా కేసులు కోసం మోడీ ని కలుస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని అన్నారు.వైసీపీ పార్టీ నాయకులు, విజయ సాయి రెడ్డితో కలిసి స్టీల్ ప్లాంట్ కోసం దొంగ ఉద్యమాలు చేశారు.3 సంవత్సరాలు గా మోడీ ని కలుస్తున్న జగన్ ఎందుకు కలుస్తున్నారో మీడియా కి ఎందుకు చెప్పడం లేదు.మోడీ టీడీపీ తో కలిస్తే ప్రత్యేక హెూదా, స్టీల్ ప్లాంట్, లాంటి వాటి కోసం అడుగుతాం.

ఈ సమావేశంలో విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు,

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బ్రాండిక్స్ లో గ్యాస్ లీకేజీ

*- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్*



విజయవాడ (విజయభాను న్యూస్) : ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అచ్యుతాపురంలో గ్యాస్ లీకేజీ జరిగిందని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ కోరారు. విశాఖ జిల్లా లో మళ్లీ విషవాయువు లీక్ ఘనట తీవ్ర ఆందోళన కలిగించిందని ఆయన అన్నారు. అచ్యుతాపురం సెజ్ లోని సీడ్స్ కంపెనీ నుంచి గ్యాస్ లీకైన ఘటనలో దాదాపు 200 మంది అస్వస్థతకు గురవ్వడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

విశాఖలో అతిపెద్ద విషాదంగా నిలిచిన ఎల్జీ పాలిమర్స్ ఘటన తరవాత కూడా పరిశ్రమల యాజమాన్యాలు, ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అచ్యుతాపురం ఘటనలో ప్రభుత్వం బాధితులను ఆదుకోవడమే కాకుండా నిర్లక్ష్యానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని శైలజ నాథ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ లోపం, వ్యవస్థల నిర్వీర్యం ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయని ఆరోపించారు.
విశాఖ జిల్లా అచ్యుతాపురం సెజ్ లోని సీడ్స్ కంపెనీ నుండి విష వాయువులు లీకై 200 మంది అస్వస్థకు గురవ్వడం బాధాకరమన్నారు. బాధితుల్లో గర్భిణీలు కూడా ఉన్నారని, జగన్ రెడ్డి కంపెనీల నుండి జే-ట్యాక్స్ వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ రక్షణ చర్యలు తీసుకోవడం, రెగ్యులర్ తనిఖీలు నిర్వహించడంపై లేకుండా పోయిందని ఆరోపించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విశాఖలో ఎల్జీ పాలిమర్స్, చిత్తూరు పూతలపట్టులో హట్సన్ డైరీలో అమ్మోనియా లీకేజీ, ఏలూరు పోరస్ కంపెనీలో గ్యాస్ లీకేజీ, నంద్యాలలో ఎస్పీవై ఆగ్రో ఇలా వరుసగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు.పరిశ్రమల నిర్వహణలో ప్రభుత్వం చూపిస్తున్న అలసత్వం, తనిఖీలు సరిగా లేకపోవడమే కారణమని, ఈ రోజు అచ్యుతాపురం సెజ్ లో జరిగిన ప్రమాదానికి కూడా ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్షయమే కారణం అని ఆరోపించారు. వరుస ఘటనలు జరిగినా, వందలాది ప్రాణాలు పోతున్నా ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం దుర్మార్గమని, అచ్యుతాపురం ఘటనలో అదృష్ట వశాత్తు ప్రాణాపాయం జరగలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పరిశ్రమల్లో సేఫ్టీ మెజర్స్ పై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, రసాయన ప్రమాదాల్లో వాయువులు బాధితులపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉన్నందున హెల్త్ కార్డులు అందించి విష వాయువుల ప్రభావం తగ్గేవరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసిన ఉత్తరాధికారి



న్యూ ఢిల్లీ (విజయభాను న్యూస్): విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి ఢిల్లీలో శుక్రవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. జూలై 13వ తేదీ నుంచి రిషికేష్ లో ప్రారంభం కానున్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామివారి చాతుర్మాస్య దీక్ష ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని కూడా కేంద్ర మంత్రికి అందించారు.



# నాన్ షెడ్యూల్ పంచాయతీ షెడ్యూల్ పంచాయతీ గా మార్చాలి

*- సర్వసభ్య సమావేశంలో డిమాండ్*



అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ శెట్టి నిలవేణి అధ్యక్షతన సభ్య సమావేశం జరిగింది. ఈ ముందుగా డముకు నుంచి పైనంపాడుకు, ఎస్ కోట నుంచి పినకోట వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని తీర్మాణం చేశారు. సర్వసభ్య సమావేశంలో లో జడ్పిటిసి గంగరాజు, బింపోల్ ఎంపీటీసీ అశోక్ , టోకురు సర్పంచ్ మొస్య, గరుగుబిల్లి ఎంపీటీసీ తౌటినాయుడు మాట్లాడుతూ... నాన్ షెడ్యూలు పంచాయతీల్లో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని, భూస్వాములు ఆగడాలు అడ్డు అదుపు లేకుండా పోతుందని, గ్రామాలను సైతం వదలకుండా భూములను కాజేస్తున్నారని, నాన్ షెడ్యూల్ పంచాయతీల్లో భూ సమస్యలను పరిష్కరిస్తూ, పంచాయతీ గా మార్చాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై పలువురు ఎంపిటిసిలు సర్పంచ్లు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను నిలదీశారు. అనంతరం ఎంపీపీ శెట్టి నిలవేణి మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇప్పటికే పలు గ్రామాలకు సోలార్ ఇతర పథకాలు మంజూరయ్యాయని త్వరలో వాటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జయవర్ధిని, శకుంతల కో ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీడీఓ నగేష్, ఈఓపిఆర్డీ మల్లేశ్వ్ర రావు, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్ లు పాల్గొన్నారు.

# మన ఆరోగ్యానికి మేలు చేసే మెంతులు ఎప్పుడు తినాలో తెలుసా?



మెంతికూర లేదా మెంతి గింజలు ఆహారంలో తరచూ వాడటం వల్ల రుచితో పాటు అనేక సమస్యలు తొలగిపోతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మధుమేహాన్ని నియంత్రించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా మెంతులు ఎంతో మేలు చేస్తాయి. ప్రోటీన్, కాల్షియం, ఐరన్, ఫైబర్ వంటి పోషకాలు మెంతికూరలో లభిస్తాయి.

మెంతి తింటే మీకు ఇవి ప్రయోజనాలు

- మెంతులు లేదా మెంతికూర తరచుగా తినడం వల్ల మధుమేహం నియంత్రణలోకి వస్తుంది.

- ఇది జుట్టు రాలడం, నెరిసిన జుట్టును తగ్గిస్తుంది. రక్తహీనత సమస్యను తగ్గిస్తుంది. - దగ్గు, ఉబ్బసం, ఊపిరితిత్తుల్లో ద్రవాలు, శ్లేష్మం గడ్డ కట్టడం, ఊబకాయం వంటి కఫ (Kapha) వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

- పక్షవాతం, మలబద్ధకం, కడుపు నొప్పి, ఉబ్బరం తగ్గించడంలో మెంతి దివ్యౌషధంగా పనిచేస్తుంది.

**ఎవరు వాడకూడదు....**

ముక్కు సంబంధిత రక్తస్రావ వ్యాధులతో బాధపడుతున్న వారు...

హెవీ పీరియడ్స్ వంటి రక్తస్రావ సమస్యలతో బాధపడుతున్నవారు...

ఇటువంటి రుగ్మతలతో బాధపడేవారు ముఖ్యంగా ఎండాకాలంలో మెంతులను తినకూడదు.

**ఎలా వాడచ్చు...**

- 1-2 టేబుల్ స్పూన్ల మెంతి గింజలు రాత్రిపూట నానబెట్టి, ఉదయాన్నే తినండి. లేదా టీ లాగా కూడా తాగొచ్చు.


- భోజనానికి ముందు లేదా రాత్రిపూట గోరువెచ్చని పాలు లేదా నీటితో ఒక స్పూన్ మెంతి పొడిని రోజుకి రెండుసార్లు తీసుకోండి.

- మెంతులను పేస్ట్ లా చేసి.. అందులో పెరుగు/కలబంద జెల్/నీటిలో కలపండి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేయడం వల్ల చుండ్రు, జుట్టు రాలడం, నెరిసిన జుట్టు వంటి సమస్యలు మటుమాయమవుతాయి.

- రోజ్‌వాటర్‌తో తయారు చేసిన మెంతికూర పేస్ట్‌ని ముఖంపై సున్నితంగా మర్దన చేయడం వల్ల డార్క్ సర్కిల్స్, మొటిమలు, మొటిమల మచ్చలు, ముడతలు తొలగిపోతాయి.

అయితే, వీటిని ఫాలో అయ్యే ముందు ప్రతి ఒక్కరు కూడా తమ ఆయుర్వేదిక్ డాక్టర్ ని సంప్రదించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# ఆరిపోయిన లివర్ స్విచ్ వెలిగింది..!




వతీకాలేయం.. మన శరీరంలోని అన్ని అవయవాల్లోకీ పెద్దదీ, ప్రత్యేకమైనదీ. అందుకే రక్తసరఫరా విషయంలో కూడా మిగిలిన అన్ని శరీర భాగాలకు ఒకలా ఉంటే, కాలేయానికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా శరీర భాగాలన్నింటి నుంచి కార్బన్‌డయాక్సైడ్‌తో కూడిన రక్తం గుండెకు, అక్కడి నుంచి ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తుల్లో వాయుమార్పిడి ద్వారా కార్బన్‌డయాక్సైడ్ తొలగిపోయి, రక్తంలోకి ఆక్సిజన్ చేరుతుంది. ఈ ఆక్సిజన్‌యుత రక్తం తిరిగి గుండెకు చేరుతుంది. గుండె దీన్ని అన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తుంది. శరీరంలో కింది వైపు ఉన్న అవయవాలన్నింటి నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా అనే అతి పెద్ద సిర గుండెకు రక్తాన్ని తీసుకువస్తుంది. అయితే జీర్ణ వ్యవస్థకు చెందిన అవయవాల నుంచి రక్తం కాలేయానికి కూడా సరఫరా అవుతుంది. ఆహారం జీర్ణం అయిన తరువాత రక్తం నుంచి పోషకాలను గ్రహించడానికి అది కాలేయానికి వెళుతుంది. ఇలా జీర్ణవ్యవస్థ నుంచి కాలేయానికి రక్తం సరఫరా అయ్యే మార్గాన్ని పోర్టల్ మార్గం అనీ, ఆ రక్తనాళాన్ని పోర్టల్ సిర అనీ అంటారు. ఇందులో తక్కువగా అంటే దాదాపు 60 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. అదేవిధంగా గుండె నుంచి హెపాటిక్ ధమని ద్వారా 98 శాతం ఆక్సిజన్‌ను కలిగివున్న రక్తం కాలేయానికి సరఫరా అవుతుంది. సాధారణంగా ఏ కారణం వల్లనైనా పోర్టల్ సిర మార్గంలో ఎక్కడైనా రక్తంలో అడ్డంకులు ఏర్పడితే, మందుల ద్వారా వాటిని తొలగించి, అవసరమైన సర్జరీ చేసేస్తారు. కాని పైన చెప్పిన పేషెంటు విషయంలో ఈ అడ్డంకు పోర్టల్ సిరలో ఎక్కడో ఒకచోట అని కాకుండా మొత్తం పోర్టల్ మార్గం బ్లాక్ అయిపోయింది. దీన్ని పోర్టో - మీసెంట్రిక్ థ్రాంబోసిస్ అంటారు. దాంతో కాలేయానికి రక్తసరఫరా ఆగిపోయింది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో కాలేయ మార్పిడి చేయడం దాదాపు అసాధ్యం. విజయవంతం అయ్యే అవకాశం దాదాపుగా ఉండదనే చెప్పాలి. సాధారణ స్థితిలో పేగుల నుంచి రక్తం పోర్టల్ సిర ద్వారా కాలేయాన్ని చేరుతుంది. అదేవిధంగా మిగిలిన శరీర భాగాల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా ద్వారా గుండెకు చేరుతుంది. ఇక్కడ ఈ రెండు మార్గాలకు మధ్య బ్రిడ్జ్ వేశార న్నమాట. అంటే కాలేయానికి, ఇన్‌ఫీరియర్ వీనకావాకి మధ్యలో ఒక బైపాస్ నాళాన్ని నిర్మించారు. దాంతో రక్తం పేగుల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావాకి, దాని నుంచి గుండెకు, తరువాత గుండె నుంచి కాలేయానికి చేరేలా రూపొందించారు. దీన్నే కావల్ ట్రాన్స్‌పొజిషన్ లేదా కావల్ స్విచ్ ఆపరేషన్‌గా వ్యవహరిస్తారు. పదమూడున్నర గంటల సుదీర్ఘ శ్రమ అనంతరం ఆపరేషన్ సక్సెస్ అయింది. కాలేయ మార్పిడి చేసినప్పటికీ కొత్త కాలేయానికి రక్త సరఫరాలో అంతరాయం లేకపోవడంతో పదిరోజుల్లో రోగి కోలుకునేందుకు వీలయింది. ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసినా, ఇలాంటి సంక్లిష్టమైన, సవాలుతో కూడిన కేసు ఇదే మొదటిసారి. ఊపితిత్తులు బలహీనంగా ఉన్నప్పటికీ, వెంటిలేటర్ మీద ఉన్న రోగి ఇలా లేచి తిరగడం ఈ ఆధునిక చికిత్స ఫలితమేనంటారు ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ టామ్ చెరియన్. సిర్రోసిస్‌తో కాలేయం దెబ్బతిన్నది. కాలేయ మార్పిడి తప్ప గత్యంతరం లేదు. కాలేయ దాత కూడా అందుబాటులో ఉన్నారు. కాని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే పరిస్థితి లేదు. బతికినన్నాళ్లు బతుకుతాడు.. అంతేగాని కాలేయ మార్పిడితో మరింత ప్రమాదాన్ని తెచ్చిపెట్టలేం అన్నారు డాక్టర్లు.

# చలికాలంలో పాదాల రక్షణ



చలికాలం వచ్చేసింది. ఈ కాలంలో చాలామందికి పాదాల సమస్య ఇబ్బంది పెడుతుంది. కాబట్టి పాదాలను అశ్రద్ధ చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనమీద ఉంది. పాదాలు ఆరోగ్యంగా కనిపించాలంటే ఈ క్రింది సూచనలను పాటిస్తే సరి..! ఎత్తు మడమల చెప్పులు వాడకూడదు. వాడితే వెన్నునొప్పి వస్తుంది. కనుక ఇతరులు మనవైపు చూడాలని కాకుండా సౌకర్యవంతమైన చెప్పులు ధరిస్తే సరి. రాత్రిపూట పడుకొనే ముందు వ్యాజిలెన్ లేదా ఇతర చర్మక్రిములు పూసి కొద్దిసేపు మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల పాదాలకు రక్తం సరఫరా అయ్యి పగుళ్లు తగ్గుతాయి. గోరువెచ్చని ఆలివ్ ఆయిల్‌తో మసాజ్ చేస్తే పాదాలు మృదువుగా మారుతాయి. బకెట్‌లో రెండు చెంబుల గోరువెచ్చని నీరుపోసి రెండు టేబుల్ స్పూన్ల గ్లిజరిన్, ఆలివ్ ఆయిల్ వేయాలి. అందులో పాదాలను ఉంచాలి. నీళ్ల వెచ్చదనం తగ్గాక పాదాలను బయటకు తీసి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. మడమలు, పాదాల వేళ్ల మధ్య సందుల్లో ఇలా అన్నిచోట్ల మసాజ్ చేసుకోవాలి. ఇలా చేయడంవల్ల నిర్జీవ కణాలు తొలిగిపోతాయి. పెరుగు, వెనిగర్ కలిపి మసాజ్ చేస్తే ఫలితం ఉంటుంది. పాదాలు కూడా మెత్తగా మారుతాయి.

చివరగా పాదాలకు వ్యాయామం తప్పనిసరి. పాదాలను నేలపై ఉంచి గుండ్రంగా ఒకవైపు ఐదారుసార్లు, మరోవైపు ఐదారుసార్లు తిప్పాలి. అలానే నేలమీద పెన్సిల్ ఉంచి పాదాల వేళ్ళతో పైకెత్తే విధంగా ప్రయత్నించాలి.

# ఎవరూ ఎంత ఎత్తు ఎదుగుతారు



కొన్ని దేశాల్లోని చిన్నారులు యుక్త వయసు వచ్చేసరికి ఎత్తు తగినంత పెరగడం లేదు. అందుకు పోషకాహార లోపమే కారణం కావొచ్చని ఈ మధ్య ఓ తాజా అధ్యయనంలో తెలిసింది. దేశాల వారీగా సగటు ఎత్తును చూస్తే.. కొన్ని దేశాల మధ్య 20 సెం.మీ. (8 అంగుళాల) వరకూ వ్యత్యాసం ఉంటుందని ఆ అధ్యయనం చెబుతోంది. 2019లో 19 ఏళ్ల అబ్బాయిల సగటు ఎత్తు నెదర్లాండ్స్‌లో అత్యధికంగా 183.8 సెంటిమీటర్లుగా ఉందనీ, అత్యల్పంగా తూర్పు టీమోర్‌లో 160.1 సెంటీమీటర్లుగా ఉందనీ ఈ అధ్యయనం పేర్కొంది ఇదే వయసు అమ్మాయిలు సగటు ఎత్తు నెదర్లాండ్స్‌లో అత్యధికంగా 170.4 సెం.మీ., గ్వాటెమాలాలో అత్యల్పంగా 150.9 సెం.మీ ఉందని లెక్కగట్టింది. 19 ఏళ్ల అబ్బాయిల సగటు ఎత్తు భారత్‌లో 166.5 సెం.మీ, బ్రిటన్‌లో 178.2 సెం.మీ, అమెరికాలో 176.9 సెం.మీ, చైనాలో 175.7 సెం.మీ.గా ఉన్నాయి. అత్యధిక ఎత్తున్న దేశాల జాబితాలో బ్రిటన్, అమెరికా, చైనా వరు సగా 39, 47, 65 ర్యాంకుల్లో నిలిచాయి. భారత్ 180వ స్థానంలో ఉంది.ఇక 19 ఏళ్ల అమ్మాయిల సగటు ఎత్తు విషయంలో భారత్ ర్యాంకు 182. భారత్‌లో వీరు సగటున 155.2 సెంటీమీటర్ల పొడవు ఉంటున్నారు. అదే బ్రిటన్, చైనా, అమెరికా ఈ జాబితాలో వరుసగా 49, 54, 58 స్థానాల్లో నిలిచాయి. 19 ఏళ్ల అమ్మాయిల సగటు ఎత్తు బ్రిటన్‌లో 163.9 సెం.మీ., చైనాలో 163.5 సెం.మీ., అమెరికాలో 163.3 సెం.మీ.గా ఉంది.ఐదేళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న 6.5 కోట్ల మంది ఎత్తుకు సంబంధిం చిన సమాచారాన్ని పరిశోధకుల బృందం విశ్లేషించి, ఈ సమాచారం వెల్లడిం చింది. ఇందుకోసం 1985-2019 మధ్య జరిగిన రెండు వేల అధ్యయనాల సమాచారాన్ని పరిశీలించింది. లాన్సెట్ మ్యాగజైన్‌లో ఈ అధ్యయన ఫలితాల్ని ప్రచురించారు.వాయువ్య, మధ్య యూరప్‌ల్లో చిన్నారులు, యువత పొడుగ్గా ఉంటు న్నారని... దక్షిణాసియా, ఆగేయాసియా, లాటిన్ అమెరికా, తూర్పు ఆఫ్రికాల్లో పొట్టిగా ఉంటున్నారని ఈ అధ్యయనం తెలిపింది. నెదర్లాండ్స్‌లో 13 ఏళ్ల బాలురు, లావోస్‌లో 19 ఏళ్ల యువకుల ఎత్తు (ఐదడుగుల నాలుగు ఇంచెలు) సమానంగా ఉంది.

నెదర్లాండ్స్‌లోని 11ఏళ్ల అమ్మాయిలు, గ్వాటెమాలా, బంగ్లాదేశ్, నేపాల్, తూర్పు టీమోర్‌ల్లో 19ఏళ్ల అమ్మాయిలు ఒకేఎత్తు (ఐదడుగులు) ఉంటున్నారు.

శరీరం బరువు, ఎత్తుకు మధ్య నిష్పత్తి ఆధారంగా బీఎంఐని లెక్కగడతారు. బీఎంఐ 18.5 నుంచి 25 మధ్య ఉంటే మనిషి ఎత్తుకు తగిన బరువు ఉన్నట్లుగా పరిగణిస్తారు. 18.5 కన్నా తక్కువ ఉంటే ఉండాల్సినదాని కన్నా బరువు తక్కువ ఉన్నట్లు, 25 కంటే ఎక్కువ ఉంటే ఉండాల్సిన దానికన్నా బరువు ఎక్కువ ఉన్నట్లు భావిస్తారు. తాజా అధ్యయనంలో పరిశోధకులు ఈ బీఎంఐని కూడా విశ్లేషించారు. పసిఫిక్ ద్వీపాలు, గల్ఫ్ దేశాలు, అమెరికా, న్యూజీలాండ్‌ల్లో యువత బీఎంఐ ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. బీఎంఐ అతితక్కువగా ఉన్న దేశాల వారికి, అతిఎక్కువగా ఉన్న దేశాల వారికి మధ్య వ్యత్యాసం చూస్తే, దాదాపు 25 కేజీల తేడా కనిపిస్తోందని చెప్పారు. పిల్లల ఎత్తు, బరువు విషయంలో జన్యువులూ ముఖ్య పాత్ర పోషిస్తాయని పరిశోధకులు అన్నారు. కానీ దేశం మొత్తం జనాభా విషయంలో మాత్రం పోషకాహారం, సామాజిక పరిస్థితులు కీలకమవుతాయని వారు చెబుతున్నారు.అంతర్జాతీయంగా అనుసరిస్తున్న పోషకాహార విధానాలూ ఎక్కువగా ఐదేళ్ల లోపు పిల్లలను దృష్టిలో పెట్టుకునే ఉంటున్నాయని, పెద్ద వయసున్న పిల్లలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు అంటున్నారు.'చిన్నతనంలో, టీనేజీలో ఆరోగ్యకరమైన ఎత్తు, బరువు ఉన్నవారు తదనంతర జీవితంలోనూ ఆరోగ్యంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయ'ని ఇంపీరియల్ కాలేజీ లండన్ పరిశోధకురాలు డాక్టర్ ఆండ్రియా రోడ్రిగేజ్ మార్టినెజ్ అన్నారు.'

పోషకాలు బాగా ఉండే ఆహారపదార్థాల లభ్యత పెరిగేందుకు, వాటి ధరలు తగ్గేందుకు మన అధ్యయన ఫలితాలు తోడ్పడాలి. చిన్నారుల బరువు అతిగా పెరగకుండా, ఎత్తు పెరగడానికి పోషకాలు చాలా ముఖ్యం. స్కూళ్లలోని ఉచిత భోజన పథకాల్లో వీటిని భాగం చేయాలి. అల్పాదాయ కుటుంబాలకు పోషకా హారాలను అందించే పథకాలను తేవాలి' అని ఆమె అభిప్రాయపడ్డారు.

# సమతుల సూత్రాలు

మహిళలు సమతుల ఆహారాన్ని వేళ ప్రకారం తీసుకుంటూ, శారీరక వ్యాయామానికి సరైన ప్రాధాన్యమిస్తూ ఉంటే అధికబరువు సమస్యే దరిచేరదు. అయితే, చాలామందికి ఆహారం తీసు కోవడం లో సరైన ప్రణాళిక ఉండదు. దాంతో అధిక బరువుతో పాటు అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నది పోషకాహార నిపుణుల అభిప్రాయం. ఆహార ప్రణాళికకు నిపుణులు అందిస్తున్న 5 సూత్రాలు..

భావోద్వేగాల ప్రభావం ఆరోగ్యం మీద చూపుతుంది. ఇలాంటి సమయాల్లో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, లేదా అసలు తీసుకోకపోవడం జరుగుతుంటుంది. మానసిక ఒత్తిడి అదుపులో లేకపోతే ఆహారం మీద అదుపు ఉండదు. అనారోగ్యకరమైన ఆహారం మరింత మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇదొక విషవలయంగా మనిషిని వేధిస్తూనే ఉంటుంది.

మనిషి తన అవసరాలకు అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. ఆ ఆహారపదార్థాలు సరియైనపాళ్ళలో వుండాలి. అవి ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన శక్తినీ, అమినో ఆమ్లాలనీ, విటమిన్లనీ, లవణాలనీ, కొవ్వునీ, పిండి పదార్థాలనీ ఇవ్వగలిగి వుండాలి. ఇటు వంటి ఆహారాన్ని సమతుల్య ఆహారం అంటాం. ఆహారపదార్థాలు సరియైన పాళ్ళలో లేక పోతే... అంటే- కొన్ని పదార్థాలు ఎక్కువైనా, తక్కువైనా అందులోని సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. అయితే మనం రోజూ తినే ఆహారాన్నే కొద్దిగా మార్పులు, చేర్పులతో సమతుల్యంగా మలచుకోవచ్చు. సమతుల్య ఆహారం కన్నా ఆరోగ్యకరమైనదీ, పుష్టికరమైనదీ సాధారణ శ్రమ చేస్తూ జీవనం సాగించే వారికి ఈ విధమైన ఆహారం సమతుల్యంగా ఉండవచ్చు.ఇందుకోసం నిపుణులు అందిస్తున్న పంచ సూత్రాలను చూద్దామా...

**1.ఆహార ప్రణాళిక:**

డైట్ ప్లాన్ సరిగ్గా ఉండాలి కదా అని ఒకే తరహా ఆహారంతో సరిపెట్టేయకూడదు. దీని వల్ల ఆ ప్రణాళిక సవ్యంగా నడవదు. కొన్ని రకాల పదార్థాలు మరికొన్నింటితో కలిపితే రుచిగానే కాదు, ఆరోగ్యానికీ మేలు కలుగుతుంది. అయితే, ఏ పదార్థాలు కలిపితే శరీరానికి మంచిది అనేవి తెలిసుండటం ముఖ్యం. ఉదాహరణకి- చేపలు ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని చాలామందికి తెలుసు. అయితే, చేపలను కూరల రూపకంగానే కాకుండా ఆవిరి మీద ఉడికించి, గ్రిల్ చేసి, ఇతర కూరగాయల సలాడ్స్‌తో తీసుకోవచ్చు.

**2.ఎంపిక ప్రధానం:**

లక్ష్యం వైపుగానే ఆహారపు అలవాట్లు ఉండాలి. మనకు నచ్చనిదైనా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని కూడా మెల్ల మెల్లగా మొదలుపెట్టి శరీరానికి అలవాటు చేయవచ్చు. దీని వల్ల లక్ష్యానికి త్వరగా చేరువకావచ్చు.

**3.భాగస్వామి ఎంపిక:**

కుటుంబంలోనో, స్నేహితుల్లోనో, సహోద్యోగుల్లోనూ.. మీలాగే ఆహారనియమాలు పాటించే వ్యక్తిని ఈ నియమాల్లో భాగస్వామిగా ఎంచుకోండి. దీని వల్ల ఆహార నియమాలను పాటించడంలో ప్రోత్సాహం ఉంటుంది. వాయిదా వేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

## ఆగస్టు 7న రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణమస్తు

# ఉచిత సామూహిక వివాహాలు

- దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ హయాంలో జరిగాయి మళ్లీ ఇన్నాళ్లకు సీఎం జగన్ హయాంలో జరుగుతున్నాయి.

- పేదల పిల్లలకు వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతోనే సామూహిక ఉచిత వివాహాలు.

- అర్హులైన వారందరూ ఆయా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ద్వారా నమోదు చేసుకోవచ్చు.

- టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి



తిరుమల (విజయభాను న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 7వ తేదీ ఉచిత సామూహిక వివాహాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలియజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దివంగత వైఎస్ రాజేశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణ మస్తు ఉచిత సామూహిక వివాహాలు పెద్ద ఎత్తున నిర్వహించారని చెప్పారు. ఆయన మరణం తరువాత ఈ కార్యక్రమం నిలిపి వేశారనీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశంతో ఈ కార్యక్రమం పునఃప్రారంభించాలని తమ పాలకమండలి నిర్ణయం తీసుకుందని సుబ్బారెడ్డి వివరించారు. పేదలకు తమ పిల్లల వివాహాలు ఆర్థికంగా భారమై వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఉచితంగా వివాహాలు జరిపించను న్నామని చెప్పారు. ఆగస్టు 7వ తేదీ చాంద్రమాన శుభకృత్ నామ సంవత్సరం శ్రావణ శుక్ల దశమి ఆదివారం ఉదయం 8.07 గంటల నుంచి 8.17 గంటల మధ్య అనూరాధ నక్షత్రం సింహ లగ్నంలో వివాహాలు జరిపించాలని పండితులు సుముహూర్తం నిర్ణయించారని చైర్మన్ తెలిపారు. అర్హులైన వారందరూ ఆయా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ద్వారా నమోదు చేసుకోవచ్చు న్నారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తే టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక ఉచిత వివాహాలు జరిపిస్తామని చెప్పారు.

# విద్యార్థులలో నైపుణ్యాల వృద్ధికి గీతం కృషి

### గీతం రిజిస్ట్రార్ ప్రొ॥గుణశేఖరన్



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : పోటీ ప్రపంచంలో ఎలాంటి లక్ష్యాలను అయినా విజయ వంతంగా సాధించడానికి వీలుగా నైపుణ్యాలను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పేర్కొన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జిసిజిసి) ఆధ్వర్యంలో ఆఖరి సంవత్సరం విద్యార్థులకు లింక్‌డిన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. విద్యార్థులకు ప్రపంచ శ్రేణి సంస్థలలో ఉద్యోగ అవకాశాలతో పాటు ఉన్నత విద్య సంస్థలలో ప్రవేశానికి, పోటీ పరీక్షలలో విజయం సాధించడానికి జిసిజిసి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడానికి విద్యార్థులే నిర్వాహకులుగా మారి వివిధ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గీతం ఛీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎన్.క్రిష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాంగణ నియామకాలతో పాటు పదిమందికి ఉపాది కల్పించే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారాలని ప్రస్తుత స్టార్టప్ వాతావరణాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. లింక్‌డిన్ సంస్థ గ్రోత్ పార్ట్‌నర్ షిప్ మేనేజర్ రామ్‌దాస్ కన్నన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణులతో సంబంధాలకు లింక్‌డిన్ వేదికగా ఉపయోగపడుతుందని అలాగే 60 మిలియన్ల కంపెనీలతో అనుసంధానం అవుతుందన్నారు. విద్యార్థులు సభ్యత్వం తీసుకోవడం ద్వారా లింక్‌డిన్‌లో లభించే అవకాశాల ఆధారంగా కొత్త నైపుణ్యాలను పెంచుకోవచ్చునన్నారు. లింక్‌డిన్ సభ్యత్వం విద్యార్థులు తమ ప్రతిభను బ్రాండ్ ఇమేజ్‌గా కంపెనీల దృష్టికి తీసుకు వెల్లడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. లింక్‌డిన్ ప్రీమియం సభ్యత్వం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మొదటి సారి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఇస్తున్నామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిసిజిసి సహాయి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జనసేన సిద్ధం

- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జనసేన సిద్ధం
- జన సైనికులను బెదిరింపులకు గురి చేస్తే దీటుగా సమాధానం చెప్తాం..
- జనసేనపై అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తే సహించేది లేదు
- ఉత్తరాంధ్రలో పార్టీకి బలమైన పునాదులుగా ఏర్పడ్డ జనసైనికులను కదిలించడం ఎవరి తరం కాదు

**జనసేన పార్టీ పీ.ఏ.సీ. సభ్యులు కొణిదెల నాగబాబు**





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జన సైనికులను బెదిరింపులకు గురి చేస్తే దీటుగా సమాధానం చెప్తామని జనసేన పార్టీ పీ.ఏ.సీ. సభ్యులు కొణిదెల నాగబాబు పేర్కొన్నరు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం విశాఖ పార్టీ ప్రాంతీయ కార్యలయంలో విశాఖపట్నం జిల్లా జనసైనికులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని అనంతరం మిడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జనసేనపై అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తే సహించేది లేదు ఉత్తరాంధ్రలో పార్టీకి బలమైన పునాదులుగా ఏర్పడ్డ జనసైనికులను కదిలించడం ఎవరి తరం కాదన్నారు. వై.సీ.పీ. ప్రభుత్వం అధికార మదంతో జనసేన గురించి అసత్యపు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్న విధానాన్ని సహించేది లేదని, కార్యకర్తలపై తప్పుడు కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం తమ దృష్టికి వస్తున్నాయని, పదవులను అడ్డం పెట్టుకొని బరి తెగించి ప్రవర్తిస్తున్న వారికి తగిన రీతిలో గట్టిగా సమాధానం చెప్తామని జనసేన పార్టీ పీ.ఏ.సీ. సభ్యులు కొణిదెల నాగబాబు స్పష్టం చేసారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖపట్నం జిల్లా మీడియా ప్రతినిధులతో నాగబాబు మాట్లాడారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని నాగబాబు అన్నారు. శుక్రవారం విశాఖ జిల్లాలో జనసేన నేతలతో సమావేశమైన ఆయన పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విశాఖ హెరిటేజ్ అయిన రుషికొండను కొట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొత్తులపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ముందస్తు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జనసేన పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. త్వరలో బూత్ కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీచేసే ఆసక్తి తనకు లేదని నాగబాబు స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పార్టీకి బలమైన పునాదులుగా ఏర్పడ్డ జన సైనికులను కదిలించడం ఎవరి తరం కాదని, వారంతా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ భావజాలానికి కట్టుబడి పని చేస్తున్నారని, జన సైనికులను ఆయనకు దూరం చెయ్యలేరని పేర్కొన్నారు. మూడు రోజుల ఉత్తరాంధ్ర పర్యటనలో కార్యకర్తలు చాలా సమస్యలు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు.

జనసేన న్యాయ విభాగం నుంచి జన సైనికులకు సహాయం అందజేస్తామని అన్నారు. విశాఖపట్నం జిల్లా పరిధిలోని విశాఖపట్నం నార్త్, విశాఖపట్నం సౌత్, విశాఖపట్నం ఈస్ట్, గాజువాక, పెందుర్తి, విశాఖపట్నం వెస్ట్, భీమిలి, అనకాపల్లి, మాడుగుల, పాయకరావుపేట, చోడవరం, ఎలమంచిలి, పాడేరు, అరకు, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు, వీర మహిళలతో మాట్లాడడం జరిగిందని, వారంతా పార్టీ అభివృద్ధి కోసం కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు.

**- ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖపట్నంలో జరుగుతున్న సమావేశంలో జనసేన శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతున్న జనసేన పార్టీ పీ. ఏ. సీ. సభ్యులు కొణిదెల నాగబాబు..**

**- జనసేన పీ.ఏ.సీ. సభ్యులు కొణిదెల నాగబాబు ఉత్తరాంధ్ర పర్యటనలో చేరికలు ఊపందుకున్నాయి. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం అభ్యర్థి పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో నాయకులను నాగబాబు పార్టీ కండువాలతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు.**

## పాలిథిన్ రహిత నగరంగా విశాఖను తిర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 75 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు కాని దానికి సంబంధించిన ఇతర వస్తువులు కాని నిషేదించడానికి ఒక నిర్ణయం తీసుకున్నామని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఉదయం కంచరపాలెం మరియు మర్రిపాలెం లో ఉన్న రైతు బజారులో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు . పాలిథిన్ రహిత నగరంగా విశాఖను తిర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. దుకాణాల వద్దకు వెళ్లి స్వయంగా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు వారికి వివరించారు. గుడ్డ సంచులతో మార్కెటు వెళ్లి తోటి వినియోగదారులకు ఆదర్శంగా నిలవాలని నగరవాసులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల అనుమతితోనే ముందుకు వెళ్తున్నామని, అలాగే అందరూ రాజకీయ ప్రతినిధులు, అధికారులు, ప్రజలకు దీని మీద చక్కటి అవగాహన కల్పిస్తున్నారన్నారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ బ్యాగుల బదులు గుడ్డ సంచులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. మున్సిపల్ సిబ్బంది గత వారం పది రోజుల నుంచి దీనిపై ప్రచారాలు చేయడం జరుగుతుందన్నారు. ఖచ్చితంగా దీనిని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లటానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు.

కార్యక్రమంలో జీ.వి.యం.సి కమీషనర్ లక్ష్మీషా, డిప్యూటీ మేయర్లు జియ్యని శ్రీధర్, కె.సతీష్, జీ.వి.యం.సి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కె.ఎల్.ఎన్.శాస్త్రీ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com